www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 25 మే 2023

5

ఏలూరు

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఏలూరు అర్బన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. బుధవారం ప్రారంభమైన ఈ పరీక్షలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 69 కేంద్రాల్లో జరిగాయి. బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకూ జరిగిన మొదటి సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ పరీక్షలకు మొత్తం 5,003 మందికి 4552 మంది హాజరయ్యారు. 451 మంది గైర్హాజరయ్యారు. 91 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 4,560 మందికి 4201 మంది హాజరు కాగా 359 మంది గైర్హాజరయ్యారు. అలాగే వృత్తివిద్యా కోర్సులకు సంబంధించి 443 మందికి 351 మంది హాజరు కాగా 92 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ పరీక్షలకు మొత్తం 1,523 మందికి 1,281 మంది హాజరు కాగా 242 మంది గైర్హాజరయ్యారు. 84శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 981 మందికి 809 మంది హాజరుకాగా 172 మంది గైర్హాజరయ్యారు. అలాగే వృత్తివిద్యా విభాగంలో 542 మందికి 472 మంది హాజరు కాగా 70 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

కూలికి వెళ్తేనే కూడు..!

వ్యవసాయ కార్మికుల బతుకులు దుర్భరం
ఉపాధి హామీలో యంత్రాల వినియోగంతో తగ్గిపోతున్న పనిదినాలు
పనుల కోసం కార్మికులు ఎదురుచూపు
ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర
పని దినాలు పెంచాలని డిమాండ్
జిల్లాలో కూలీల పరిస్థితులే అందుకు నిదర్శనం

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వ్యవసాయ కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారింది. చేసుకునేందుకు కూలి పనులు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడుతున్నాయి. యంత్రాల వినియోగంతో పొలంపనులు తగ్గిపోవడం, ఉపాధిహామీ పనులు సక్రమంగా చూపకపోవడంతో కూలీలు నానాఅవస్థలు పడుతున్నారు. వ్యవసాయ కార్మికులకు వెన్నుదన్నుగా ఉండాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. పొలాల్లో పనులు తగ్గిపోవడంతో ఉపాధి పనులను ఏడాదిలో 200 రోజులకు పెంచాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

రెండు జిల్లాల్లో దాదాపు 12 లక్షలకుపైగా వ్యవసాయ కార్మికులున్నారు. వీరంతా వ్యవసాయ పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయరంగంలో యాంత్రీకరణ పెరగడంతో పనిదినాలు బాగా తగ్గిపోయాయి. ఒక ఎకరం వరిసాగుచేస్తే ఏడాదికి 30 రోజుల నుంచి 40 రోజులు పనులుండేవి. ఇక చెరకు, పొగాకు, మొక్కజొన్న, ఆయిల్‌పామ్ సాగులోనూ పనిదినాలు పెద్దఎత్తున కూలీలకు దొరికేవి. వ్యవసాయరంగంలో యాంత్రీకరణ పెరగడంతో పనిదినాలు బాగా తగ్గిపోయాయి. ఆక్వా చెరువులు పెరిగిపోయాయి. జిల్లాలో దాదాపు రెండున్నర లక్షల ఎకరాల్లో ఆక్వా చెరువులు వెలిశాయి. పదెకరాల ఆక్వా చెరువుకు సంబంధించి ఒకరిద్దరు ఉంటే పని పూర్తయిపోతోంది. చేపలు, రొయ్యలు పట్టుబడి పట్టే సమయంలో మాత్రమే కూలీల అవసరం ఉంటుంది. దీంతో పది ఎకరాల చేపల చెరువుల్లో ఏడాదిలో ఒకటి, రెండు రోజులు మాత్రమే పని ఉంటుంది. వరిసాగులో అయితే నారుమడి వేసినప్పటి నుంచి నాట్లు, కలుపు, కోత, నూర్పిడి, ధాన్యం తరలింపు ఇలా నిరంతరం పని ఉంటుంది. పనిదినాలు తగ్గిపోవడంతో కూలీలు ఆర్థికంగా తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనిలేక దొరికిన పనికి వెళ్లాల్సి వస్తోంది. మహిళలు అయితే పూర్తిగా ఇంటికే పరిమితం కావాల్సి వస్తుంది. ఇలాంటి తరుణంలో ఉపాధి పనులే వ్యవసాయ కూలీలకు ఆధారంగా మారాయి.

ఉపాధి పనులే ఆధారం

వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో ఉపాధి పనుల కోసం కూలీలు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. ఏడాదికి వందరోజులు పని కల్పించాలని నిబంధన ఉన్నా 50 రోజులు కూడా కల్పించని పరిస్థితి ఉంది. ఇల్లు గడవడం కోసం వృద్ధ కూలీలు సైతం ఉపాధి పనికి వెళ్తేనే రోజు గడిచే పరిస్థితి నెలకొంది. వ్యవసాయ పనుల్లేకపోవడంతో ఉపాధి హామీ కూలీలకు బతుకుదెరువుగా మారింది. ప్రస్తుతం పెరిగిన ధరలతో ఉపాధి కూలీలకు ఇచ్చే కూలి ఏమాత్రమూ సరిపోవడం లేదు. రోజుకు ఉపాధి కూలి రూ.272 ఇస్తున్నట్లు చెబుతున్నా.. కూలీలకు వచ్చేది మాత్రం రూ.240 మాత్రమే ఉంటుంది. పనులు లేకపోవడంతో ఈ కూలికే వ్యవసాయ కార్మికులు పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏడాదికి 200 రోజులు పనిదినాలు పెంపుచేయాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కూలీలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయ కార్మికులను ఆదుకునే విధంగా ఉపాధి హామీ చట్టాన్ని మరింత మెరుగుపరచాలని కోరుతున్నారు.

ఉపాధి పనులే ఆధారం

పి. కోటేశ్వరరావు, ఉపాధి కూలీ

నా వయస్సు 70 ఏళ్లు. వ్యవసాయ పనులు ఉంటే వెళ్తాను. అపనులు తగ్గిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఉపాధి పనులే మా కుటుంబానికి ఆధారం. ఉపాధి పనులు మరింత పెంపు చేసి, కూలి ధర పెంచాలి. ప్రస్తుతం పెరిగిన ధరలకు కూలి ఏమాత్రమూ సరిపోవడం లేదు.

ఉపాధి పని దినాలు పెంచాలి

జి.మల్లేశ్వరరావు, ఉపాధి కూలీ

వ్యవసాయ పనులు బాగా తగ్గిపోయాయి. ఇల్లు గడవడం కష్టంగా మారింది. నా వయస్సు 72 ఏళ్లు. అయినప్పటికీ ఉపాధి పనికి వస్తున్నాను. ఉపాధి పనులు లేకపోతే మరింత ఇబ్బంది పడాల్సి ఉంటుంది. ఉపాధి పనులు పెంపుచేయాలి. అప్పుడే కూలీలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.



నమూన చెక్కు అందిస్తున్న కలెక్టర్

26,024 మంది విద్యార్థులకు విద్యాదీవెన లబ్ధి

23,455 మంది తల్లుల ఖాతాల్లో రూ. 24.78 కోట్లు జమ - కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జగనన్న విద్యా దీవెన కింద 26,024 మంది అర్హులైన విద్యార్థులకు సంబంధించి 23,455 మంది తల్లుల ఖాతాలకు రూ.24.78 కోట్లు ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో ఈ కార్యక్రమాన్ని సిఎం జగన్ బుధవారం ప్రారంభించారు. ఏలురు కలెక్టరేట్ నుంచి ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, బిసి సంక్షేమ శాఖ అధికారి ఆర్‌వి.నాగరాణి, విద్యార్థులు, తల్లులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రూ.24.78 కోట్ల మెగా చెక్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద విద్యార్థులు పెద్ద చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతో ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమం తప్పకుండా ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ వారి తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారన్నారు. జిల్లాలో జగనన్న విద్యాదీవెన కింద 26,024 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందన్నారు. అందులో ఎస్‌సి సంక్షేమానికి 335 మంది విద్యార్థులకు చెందిన 334 మంది తల్లుల ఖాతాలల్లో రూ.43 లక్షలను జమ చేశారన్నారు. ఎస్‌టి సంక్షేమానికి 1483 మంది విద్యార్థులకు చెందిన 1371 మంది తల్లుల ఖాతాల్లో రూ.86 లక్షలు, బిసి సంక్షేమానికి 15,361 మంది విద్యార్థులకు చెందిన 13,779 మంది తల్లుల ఖాతాల్లో రూ.14.02 కోట్లను జమచేశారన్నారు. ఇబిసి కింద 3041 మంది విద్యార్థులకు చెందిన 2777 మంది తల్లి ఖాతాల్లో రూ.3.90 కోట్లు, ముస్లిం మైనారిటీ కింద 905 మంది విద్యార్థులకు చెందిన 791 మంది తల్లుల ఖాతాల్లో రూ.84 లక్షలను జమ చేయడం జరిగిందన్నారు. కాపు సంక్షేమం కింద 4486 మంది విద్యార్థులకు చెందిన 4038 మంది తల్లుల ఖాతాల్లో రూ.4.36 కోట్లు, క్రిస్టియన్ మైనారిటీ కింద 413 మంది విద్యార్థులకు చెందిన 365 మంది తల్లుల ఖాతాల్లో రూ.38 లక్షలు జమ చేశారన్నారు.

నియోజకవర్గాల వారీగా...

చింతలపూడి నియోజకవర్గంలో 3818 మంది విద్యార్థులకు రూ.3.71 కోట్లు, దెందులూరు నియోజకవర్గంలో 4,329 మంది విద్యార్థులకు రూ.4.41 కోట్లు, ఏలూరు నియోజకవర్గంలో 2,592 మంది విద్యార్థులకు రూ.2.81 కోట్లు, గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల మండలంలో 731 మంది విద్యార్థులకు రూ.68 లక్షలు, కైకలూరు నియోజకవర్గంలో 3497 మంది విద్యార్థులకు రూ.3.20 కోట్లు, నూజివీడు నియోజకవర్గంలో 4,050 మంది విద్యార్థులకు రూ.3.98 కోట్లు, పోలవరం నియోజకవర్గంలో 3628 మంది విద్యార్థులకు రూ.2.86 కోట్లు, ఉంగుటూరు నియోజకవర్గంలో 3379 మంది విద్యార్థులకు రూ.3.12 కోట్ల లబ్ధి చేకూరింది.

ప్రశాంతంగా ఐసెట్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఐ సెట్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఏలూరులోని మూడు కేంద్రాలైన వట్లూరులోని సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలల్లో రెండు షిప్టులలో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 900 మందికి 805 మంది హాజరు కాగా 95 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో జరిగిన పరీక్షకు 180 మందికి 158 మంది హాజరు కాగా 22 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 130 మందికి 115 మంది, సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 140 మందికి 125 మంది హాజరయ్యారు. మొత్తం ఉదయం షిఫ్ట్‌లో 450 మందికి 398 మంది హాజరు కాగా 52 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం షిఫ్ట్‌లో సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి 165 మంది, ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 130 మందికి 111 మంది, సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 140 మందికి 131 మంది హాజరయ్యారు. మొత్తం రెండు షిఫ్టులలో 450 మందికి 407 మంది హాజరు కాగా 43 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు జిల్లాలోని మొత్తం మూడు కేంద్రాలకు ప్రత్యేక పరిశీలకులుగా ఎస్‌కె యూనివర్సిటీకి చెందిన ఎన్‌ఆర్.సదాశివరెడ్డి వ్యవహరించారు.

మినీ మహానాడుకు హాజరైన టిడిపి ప్రతినిధులు

జగన్ అరాచక పాలనకు చరమగీతం

చింతలపూడి నియోజకవర్గ టిడిపి మినీ మహానాడులో నేతలు

ప్రజాశక్తి - కామవరపుకోట

సిఎం జగన్ అరాచకపాలనను అంతమొందించి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ఏకైక లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని మాజీ మంత్రులు, టిడిపి నేతలు ప్రత్తిపాటి పుల్లారావు, కొల్లు రవీంద్ర, కెఎస్.జవహర్, పితాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. చింతలపూడి నియోజకవర్గం మినీ మహానాడు, ఎన్‌టిఆర్ శతజయంతి వేడుక కామవరపుకోటలో టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన టిడిపి ప్రతినిధులు, మాజీ మంత్రులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దెందులూరు మాజీ శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, మాజీమంత్రి, చింతలపూడి మాజీ శాసనసభ్యులు పీతల సుజాత, చింతలపూడి మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీకృష్ణ, నూజివీడు నియోజకవర్గ పార్టీ బాధ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, ఏలూరు నియోజకవర్గ టిడిపి బాధ్యులు బడేటి రాధాకృష్ణ, మాజీ జెడ్‌పి ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, గోపాలపురం నియోజకవర్గ టిడిపి బాధ్యులు మద్దిపాటి వెంకట్రాజు, పోలవరం నియోజకవర్గ టిడిపి బాధ్యులు బొరగం శ్రీనివాస్, పోలవరం మాజీ శాసనసభ్యులు మొడియం శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న నాయకులు

నష్టపోయిన అరటి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

ప్రకృతి వైపరీత్యాల వల్ల అరటి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు ఈదురు గాలులు, అకాల వర్షాలకు భీమడోలు మండలం పొలసానిపల్లిలో పంట నష్టపోయిన అరటి తోటలను ఆయనతో పాటు ఆయన ఆధ్వర్యంలోని ఎపి రైతు సంఘం బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా పంట నష్టం వివరాలను అరటి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరం విస్తీర్ణంలో అరటి సాగుకు రైతులు లక్ష రూపాయల వరకూ పెట్టుబడి పెట్టారన్నారు. ఈదురు గాలులు, అకాల వర్షాల వల్ల 50 శాతం వరకూ అరటి చెట్లు పడిపోయాయన్నారు. గెలలు తయారయ్యే దశలో అరటి చెట్లు పడిపోవటం వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. వీరిని ఆదుకునేందుకు ఉద్యానవన అధికారులు నష్టం వివరాలను నమోదు చేసి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. దీనికి అదనంగా నష్టపోయిన అరటి రైతుకు పంటల బీమా పరిహారం కూడా చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కర్‌రావు, రాంబాబు పాల్గొన్నారు.

పాత బట్టలు సేకరిస్తున్న సిబ్బంది

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్. వెంకటకృష్ణ అ న్నారు. 'మేరా స్వచ్ఛ షెహర్' కార్యక్రమంలో భాగంగా పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యతను ప్రజలకు తెలి యజేసేందుకు బుధ వారం ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్) కార్యక్రమాల్లో భాగంగా రీయూజ్ కార్యక్రమంలో భాగంగా నాలుగు వేల కేజీల పాత బట్టల సేకరణ జరిగిందన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లను, డ్వాక్రా సంఘాల సభ్యులను, మెప్మా సిబ్బంది భాగస్వాములను చేసి, ఈ సేకరణ జూన్ ఐదో తేదీ వరకూ కొనసాగిస్తామని తెలిపారు. పట్టణ ప్రజలు సమీపంలో ఉన్న వార్డు సచివాలయంలోని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లలో తమవంతు కృషిగా పాత బట్టలను ఇవ్వాలని కమిషనర్ కోరారు.

నిర్వాసితుల సమస్యలపై అమరాతికి త్వరలో పాదయాత్ర

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం ప్రాజెక్టు నిధుల కోసం, నిర్వాసితుల పునరావాసం, ప్యాకేజీ తదితర సమస్యలకు పరిష్కారం నిమిత్తం త్వరలో పోలవరం నుంచి అమరావతి వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, జిల్లా ఇంఛార్జి అక్కినేని వనజ తెలిపారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 23న విజయవాడలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగిందని, ఈ సమావేశంలో రానున్న కాలంలో ప్రజా క్షేత్రంలో సమస్యలపై సిపిఐ చేసే పోరాటాలు చర్చించామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తున్నారని విమర్శించారు. సిపిఐ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఇరిగేషన్ ప్రాజెక్టులను పరిశీలించి, పోలవరం ప్రాజెక్టు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ఆందోళనకు సిద్ధం అవుతుందని తెలిపారు. తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టును కేంద్రమే నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు కేంద్రమే నిర్మించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో పోలవరం నుంచి అమరావతి పాదయాత్రకు శ్రీకారం చూడుతున్నామని తెలిపారు. ఈ నెల 28న విజయ వాడలో సమావేశమై పాదయాత్రపై కార్యాచరణ రూపొంది స్తామన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల సందర్భంగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రతి ఎకరాకు రూ.5 లక్షలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా రూ.10 లక్షలు ఇస్తామని వాగ్దానం చేసి నిర్వాసితులను మోసం చేశారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే 7.20 లక్షల ఎకరాలకు సాగునీరు, 20 లక్షల ఎకరాలకు సరిపడా సాగునీరు స్థిరీకరణ, 960 మెగావాట్లు విద్యుత్ లభ్యమవుతుందన్నారు. 26 జిల్లాలు అభివృద్ధి చెందే విధంగా పోలవరం ప్రాజెక్టు ఉపయోగపడుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ధర్నా చేస్తున్న నాయకులు

ఏజెన్సీ ప్రాంతంలో సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ డిమాండ్ చేశారు. మండలంలోని కోట రామచంద్రపురంలో ఉన్న ఐటిడిఎ కార్యాలయం వద్ద సిపిఐ జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ప్రత్యక్షంగా పాల్గొన్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, సిపిఐ ఇన్‌ఛార్జి అక్కినేని వనజ మాట్లాడుతూ తరతరాలుగా గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో పోడు సాగు చేస్తున్న గిరిజనులు దరఖాస్తు చేసి సంవత్సరాలు గడుస్తున్నా పట్టాలు ఇవ్వడంలో జాప్యం ఏంటని ప్రశ్నించారు. గ్రామ సభలు నిర్వహించి అర్హులందరికీ పారదర్శకంగా పట్టాలు పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అధికారులను కలిసి పలుమార్లు వినతులు ఇచ్చినా అర్హులను గుర్తించడంలో నిర్లక్ష్యం కొనసాగుతుందని విమర్శించారు. ఐటిడిఎ కార్యాలయానికి కనీసం ప్రాజెక్టు అధికారిని నియమించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవాచేశారు. ప్రభుత్వం తక్షణం ఐటిడిఎకు ప్రాజెక్టు అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. తరాల నుంచి చత్తీష్‌గఢ్, ఇతర ప్రాంతాల నుంచి గిరిజనులు ఏజెన్సీ ప్రాంతానికి వలస వచ్చారని, వారికి ఆధారాలు ఉన్నా రెవెన్యూ యంత్రాంగం కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడానికి మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. రెవెన్యూ యంత్రాంగం వారికి ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు తక్షణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్య పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా అర్హులైన గిరిజనులకు హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుని పోడు సమస్య పరిష్కార చర్యలకు అటవీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం మెడలు వంచి సమస్య పరిష్కారమయ్యేవరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. పోడు భూముల సమస్య పరిష్కారానికి సిపిఐ అండగా ఉంటుందన్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో నిర్వాసితులకు నేటికీ సమస్య పరిష్కారం చేయకుండా ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు. వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ప్రజలు బిక్కుబిక్కుమంటూ భయంతో జీవితాన్ని దుర్భరంగా గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో పోడు భూముల సమస్యలపై మూడుసార్లు ఐటిడిఎ కార్యాలయం వద్ద ధర్నా, ముట్టడి కార్యక్రమాలు నిర్వహించినా సమస్య పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభించిందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ గతంలోనే పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని దరఖాస్తులు ఇచ్చామని, నేటివరకూ పరిష్కారం కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ కార్యక్రమం చేపట్టి జిల్లా యంత్రాంగం పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ జివిఎస్.సత్యనారాయణకు దరఖాస్తులు, వినతిపత్రం అందించారు. అనంతరం ఐటిడిఎ పిఒ మాట్లాడుతూ దరఖాస్తులన్నిటినీ పరిశీలించి విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్, ఎపి గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కారం దారయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, సన్నేపల్లి సాయిబాబా, మైసాక్షి వెంకటాచారి, జమ్మి శ్రీనివాసరావు, జెవి.రమణరాజు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర మధు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఐతా సురేష్, నాయకులు పాల్గొన్నారు.

సివిల్స్‌లో వసంతకుమార్‌కు ఉత్తమ ర్యాంకు

ప్రజాశక్తి - భీమడోలు



తల్లిదండ్రులతో వసంతకుమార్

మండలంలోని గుండుగొలను గ్రామానికి చెందిన రాళ్లపల్లి వసంతకుమార్ మరొక మారు సివిల్స్ పరీక్షల్లో ర్యాంకును సాధించారు. ట్రాన్స్ కో ఏలూరు కార్యాలయంలో ఎఇగా పనిచేస్తున్న రాళ్లపల్లి భీమేశ్వరరావు, అనసూయ దంపతులకు రాళ్లపల్లి వసంత కుమార్ రెండో కుమారుడు. అన్నదమ్ములైన రాళ్లపల్లి జగత్ సాయి, రాళ్లపల్లి వసంత కుమార్ 2021 సివిల్స్‌లో ర్యాంకులు సాధించారు. వీరిలో 32వ ర్యాంకు సాధించిన జగత్‌సాయి ఐఎఎస్‌గా కొనసాగుతున్నారు. అప్పట్లో 170 ర్యాంకు సాధించిన రాళ్లపల్లి వసంతకుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీలో ఐపిఎస్ శిక్షణలో ఉన్నారు. ఇదే క్రమంలో అన్నయ్య తరహాలో ఐఎఎస్‌కు ఎంపిక కావాలని 2023 సివిల్స్ పరీక్షలకు హాజరయ్యారు. గతంతో పోల్చుకుంటే ర్యాంకు మెరుగుపడి 157వ ర్యాంకును సాధించారు. ఈ సందర్భంగా ఆయన తండ్రి రాళ్లపల్లి భీమేశ్వరరావు మాట్లాడుతూ తన కుమారుడు ప్రస్తుతం కొనసాగుతున్న ఐపిఎస్ శిక్షణలోనే కొనసాగుతారని తెలిపారు.



మాట్లాడుతున్న డిఎల్‌డిఒ రాజు

విధులు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో పని చేస్తున్న గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది విధుల్లో సక్రమంగా పని చేయాలని డిఎల్‌డిఒ ఎం.రాజు తెలిపారు. మండలంలోని స్వర్ణవారిగూడెం, వంక వారిగూడెం, పి.రాజవరం గ్రామ వార్డు సచివాలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది విధుల పట్ల సక్రమంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మంగతాయారు, పంచాయి, సచివాలయ కార్యదర్శులు, విఆర్‌ఒలు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతిఒక్కరి కుటుంబానికి అండగా ఉంటామని ఎస్‌పి మేరీ ప్రశాంతి చెప్పారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన, అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కుటుంబాలకు ఎస్‌పి చేతులమీదుగా బుధవారం ఆర్థిక సాయం అందించారు. ముగ్గురు హోంగార్డు కుటుంబాలకు ఎస్‌పి చేతులమీదుగా చెక్కులను పంపిణీ చేశారు. హోంగార్డు పి.దుర్గజగదీష్ గతేడాది ఉద్యోగ విరమణ చేశారు. ఆయన కుటుంబానికి రూ.5,55,370 చెక్కును ఎస్‌పి అందించారు. హోంగార్డు కె.విజయబాబు విధులు నిర్వర్తిస్తూ అనారోగ్య కారణాలతో మరణించారు. ఆయన భార్య నాగమణికి రూ.5,52,530 నగదును చెక్కు రూపంలో అందించారు. మరో హోంగార్డు ఇ.శివన్నారాయణ హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయన భార్య సంధ్యకు రూ.5,53,240 చెక్కును అందించారు.

కైకలూరు అభివృద్ధిలో మార్కెట్ కీలకం

ప్రజాశక్తి - కైకలూరు

సంతమార్కెట్‌కు ఎంతో చరిత్ర ఉందని, కైకలూరు అభివృద్ధిలో కీలకమని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక సంతమార్కెట్‌లో రూ.పది లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన ఫిషమెన్ చేపల విక్రయ షెడ్‌ను బుధవారం ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. సంతమార్కెట్‌లో రూ.75 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సంతమార్కెట్‌లో ఉన్న ప్రతి దుకాణదారుడు తమ షాపు ముందర పరిశుభ్రతను పాటించాలని, ఎవరైతే పాటించలో వారి మీద పంచాయతీ వారు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకటసుబ్రహ్మణ్యం, వైస్ ఎంపిపి మహ్మద్ జహీర్, వైసిపి మండల అధ్యక్షులు భట్రాజు శివాజీ, సర్పంచి దానం మేరి నవరత్న కుమారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఏ తెల్లం బాలరాజు

నష్టపోయిన రైతులకు పరిహారం

ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్త పట్టిసీమ రైతు భరోసా కేంద్రం పరిధిలో గత వారం రోజుల క్రితం దగ్ధమైన వరికుప్పల రైతులను ఎంఎల్ఎ తెల్లం బాలరాజు బుధవారం పరామర్శించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం అందిస్తామని ఎంఎల్ఎ బాలరాజు రైతులకు భరోసా ఇచ్చారు. అనంతరం జీలుగు విత్తనాలను ఉచితంగా 15 మంది రైతులకు ఎంఎల్ఎ అందించారు. రైతులు అధైర్య పడవద్దని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. వైసిపి రైతులకు ఎప్పుడూ అండగా ఉంటుందని, ఇది రైతు ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు కలుం హేమకుమారి, మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు, మైగాపుల దుర్గాప్రసాద్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలని ర్యాలీ

ప్రజాశక్తి - పోలవరం

పర్యావరణ హిత జీవన శైలిలో ప్రజలు భాగస్వాములు కావాలని పోలవరం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.ప్రసాద్ అన్నారు. పర్యావరణ హిత జీవన శైలి మేరీ లైఫ్‌లో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పట్టిసీమ గ్రామంలో ప్లాస్టిక్ వినియోగించవద్దని, కాలుష్యాన్ని నివారించాలని బుధవారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.ప్రసాద్, ఆరెస్ట్ బీట్ ఆఫీసర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - నిడమర్రు

ప్రభుత్వ విధానాలతో రైతులు నష్టపోయారని, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణరావు అన్నారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో కోనే శ్రీను అధ్యక్షతన బుధవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో నారపల్లి రమణరావు మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యానికి పంటకు సంచులు ఇవ్వడంలోనూ, కొనుగోలు చేయడంలోనూ ప్రభుత్వం వెంటనే స్పందించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గత సార్వా పంటకు ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి నేటి వరకు హమాలీ జట్టు బిల్లు, ధాన్యం డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్ బకాయిల సమస్యలు పరిష్కరించి ఆకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గవర సత్యనారాయణ, కంచ వరప్రసాద్, వెలగలేటి మోహన, నాని, సుధాకర్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - భీమడోలు

యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు కనుమాల రామయ్య తెలిపారు. స్థానిక ఎంపిపి సమావేశ మందిరంలో బుధవారం రెండు వేర్వేరు కార్యక్రమాలను ఒకే వేదికపై నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు, ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పంచాయతీరాజ్ కమిషనర్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో భాగంగా గతంలో ఇచ్చిన యోగా శిక్షణపై పునఃశ్చరణ తరగతుల్లో శిక్షణ కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. ఇదే క్రమంలో ప్లాస్టిక్ వినియోగాన్ని అదుపు చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలను పర్యావరణానికి ఇబ్బంది లేకుండా తిరిగి వినియోగంలో తెచ్చే క్రమంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులతో పాటు ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ సహాయకులు సింహాద్రితో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మినీ మహానాడుకు టిడిపి నేతలు

జంగారెడ్డిగూడెం :కామవరపుకోట మండల కేంద్రంలో నిర్వహించే మినీ మహానాడుకు స్థానిక టిడిపి నేతలు అధిక సంఖ్యలో బయలుదేరారు. టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రావూరి కృష్ణ, చూటిగుంట రాము ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు మినీ మహానాడుకు వెళ్లారు. టిడిపి మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ, కార్యదర్శి కుక్కల మాధవరావుతోపాటు రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు, మినీ మహానాడు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ మినీ మహానాడుతో పాటు రాజమండ్రిలో జరిగే మహానాడులో టిడిపి నేతలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ముదినేపల్లిలో అన్నసమారాధన

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్థానిక ఆర్‌సిఎం చర్చిలో గత మూడు రోజులుగా జరుగుతున్న సహాయమాత మహోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా సాయంత్రం సహాయమాత విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు నడుమ, బాణసంచా కాల్పుల ఊరేగింపు నిర్వహించారు. ఫాదర్ క్రీస్తురాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఊరేగింపులో పెద్దఎత్తున సంఘస్తులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన విశ్వాసులు, యువతీ, యువకులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

భార్యపై భర్త దాడి

ప్రజాశక్తి - టి.నరసాపురం

అనుమానంతో భార్యపై భర్త దాడి చేసిన సంఘటన మండలంలోని బొర్రంపాలెంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొర్రంపాలెం గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధుడు చింతా దుర్గయ్య అనుమానంతో అతని భార్య దుర్గమ్మపై మంగళవారం అర్ధరాత్రి దాడి చేశాడు. ఇంటి వద్ద నిద్రిస్తున్న సమయంలో భార్యను చంపాలనే ఉద్దేశంతో భీదుతో ఆమె మెడ మీద దాడి చేశాడు. దీంతో దుర్గమ్మను ఆమె కుమార్తె మాధవి 108 అంబులెన్సులో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దుర్గమ్మ కుమార్తె మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐ ఎ.సతీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నీటిని, ఉప్పును క్రమంగా పరీక్షించాలి

టాస్క్‌ఫోర్స్ బృందానికి సచివాలయాల శాఖ సమాచార విభాగం జిల్లా కో-ఆర్డినేటర్ టివిఎన్.స్టీఫెన్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రజలు వాడే ఉప్పు, నీరు ప్రతి నెలా పరీక్షలు జరిపి ప్రజలందరికీ ఆరోగ్యం అందించటానికి గ్రామస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందం పని చేయాలని సచివాలయాల శాఖ సామాజిక పరివర్తన మార్పు సమాచార విభాగం జిల్లా కో-ఆర్డినేటర్ టివిఎన్.స్టీఫెన్ కోరారు. మండలంలోని నందాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ కెవిఆర్.సుధాకర్ అధ్యక్షతన గ్రామస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలపై బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీఫెన్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో మూడో లక్ష్యం అందరికీ ఆరోగ్యం అందించడంగా పేర్కొన్నారు. 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో 1 నుంచి 6 సాధన కోసం గ్రామ సామాజిక ఆరోగ్య అధికారి టీం లీడర్‌గా ఐదుగురు సభ్యులతో ఈ టాస్క్ ఫోర్స్ ఏర్పాటైందని చెప్పారు. ఆ మేరకు ప్రభుత్వం ఫిబ్రవరి 28న జీఓ నెంబర్ 34 జారీ చేసిందని చెప్పారు. ఈ బృందం ప్రతినెలా సమావేశమై గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం గురించి చర్చించుకుని అందరికీ ఆరోగ్యం అందేలా చూడాలన్నారు. ప్రధానంగా లేవలేని, నడవలేని వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, యుక్తవయసు బాలల ఆరోగ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. యుక్త వయసు బాలికలకు క్రమం తప్పకుండా రక్త శాతం తెలుసుకునే పరీక్షలు జరపాలన్నారు. ఇవన్నీ సక్రమంగా జరిపించడానికి ఏర్పాటైన గ్రామస్థాయి టాస్క్ ఫోర్సు కమిటీలో ఎఎన్ఎం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్త, పాఠశాల ఆరోగ్య అంబాసిడర్, గ్రామ సంఘం అధ్యక్షులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ బృందం ప్రజలకు ఆరోగ్య పరిస్థితులు మెరుగు పర్చటం, అనారోగ్యవంతులకు సేవలు చేయటం వంటి పనులు ఈ కమిటీ చూడాలన్నారు. ఈ వృందానికి లీడర్‌గా వ్యవహరించే గ్రామ సామాజిక ఆరోగ్య అధికారి ప్రతినెలా 50 గృహాలు సందర్శించి ఆ గృహంలో వాడే ఉప్పును పరీక్షించాలన్నారు. గ్రామ సామాజిక ఆరోగ్య అధికారి గ్రామ సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను సమన్వయ పరుచుకుని ప్రజలు తాగే నీటిని పరీక్షించాలన్నారు. మెడికల్ ఆఫీసర్ కెవిఆర్.సుధాకర్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిన దృష్ట్యా అందరూ అంకితభావంతో పనిచేయాలని చెప్పారు. అనంతరం నూతిరామన్నపాలెం గ్రామ సచివాలయం పరిశీలించారు. సచివాలయం పరిధిలోని 18 ఏళ్ల లోపు బాలల వివరాలు వెంటనే సేకరించాలని సూతనంగా నియమితులైన సంక్షేమ కార్యదర్శికి సూచించారు. బడిబయట ఉన్న వారి వివరాలను సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నందాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ షేక్ సల్మా సుల్తానా, హెల్త్ సూపర్‌వైజర్లు నాగమణి, సరస్వతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.పద్మజ్యోతి, గ్రామ సామాజిక ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టివిఎన్.స్టీఫెన్

'శ్రేష్ఠ'కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ప్రతిభావంతులైన ఎస్‌సి విద్యార్థులకు సిబిఎస్ఇ అనుబంధ ప్రయివేట రెసిడెన్షియల్ పాఠశాలల్లో 9, 11 తరగతుల్లో ప్రవేశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ పథకం ప్రవేశపెట్టింది. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం-సాధికార మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆధ్వర్యంలో నేషనల్ ఎంట్రెన్స్ టెస్ట్ ఫర్ శ్రేష్ఠ (ఎన్ఇటిఎస్)-2023 ప్రకటన విడుదల చేసింది. నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడం ద్వారా వారి విస్తృత విద్య, ఉద్యోగ అవకాశాలు అందుకునేలా చేయనున్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 24 తేదీ లోపు http://www.shresh-ta.nta.nic.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

కళ్యాణమస్తుతో పాడి రైతులకు మేలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

కృష్ణా మిల్క్ యూనియన్ కళ్యాణమస్తు పథకంతో పాడి రైతులకు మేలు జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు బెజవాడ నాగేశ్వరరావు తెలిపారు. రావిచర్ల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘంలో సభ్యుడు వల్లూరి కాశీశ్వరరావు కుమార్తె వివాహం సందర్భంగా కళ్యాణమస్తు పథకంలో భాగంగా బుధవారం నూతన వధువుకు బంగారు నాణెం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు టి.యశ్వంత్, అనిల్, సుబ్బారావు, రత్నశేఖర్, శోభన్ బాబు, శేషగిరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - ఏలూరు

మండలంలోని నార్త్-ఏలూరు సెక్షన్ పరిధిలో ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియాలో ఉన్న 33 కెవి, 11 కెవి లైన్స్ షిఫ్టింగ్ వర్క్ చేయనున్న నేపథ్యంలో అశోక్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గల ఆర్.ఆర్.పేట, విజయ విహార్ సెంటర్, రామమహల్ సెంటర్, పోలీస్ క్వార్టర్స్, కలెక్టరేట్ కాంపౌండ్, కలెక్టరేట్ వెనకాల రోడ్ ఏటిగట్టు, కొత్త బస్టాండ్ ఏరియా, అశోక్ నగర్, పత్తేబాద, ఫైర్‌స్టేషన్ సెంటర్ ఏరియాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏలూరు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బదిలీలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు జిల్లాలో నర్సింగ్, పారా మెడికల్ శాశ్వత సిబ్బందికి బదిలీకి సంబంధించి ఈ నెల 25 లోపు ఏలూరు వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ డి.ఆశ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్నవారిని పరిశీలించి బదిలీ చేయనున్నట్లు తెలిపారు. బదిలీల కోసమని ఎవ్వరికీ లంచాలు, నగదు ఇవ్వరాదన్నారు. అలా ఇచ్చిగాని, తీసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

పాడి రైతుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ లక్ష్యం

ప్రజాశక్తి - చాట్రాయి

పాడి రైతు సంక్షేమమే మన మతం అలుపెరుగని సేవే మన అభిమతం కార్యక్రమంలో భాగంగా తిరువూరు క్లస్టర్ పరిధిలోని మండలంలోని తుమ్మగూడెం కమ్మూరు, తుమ్మగూడెం సంఘాలను కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు బుధవారం సందర్శించారు. పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ ద్వారా అనేక రకాల సేవలను అందిస్తున్నామన్నారు. అనంతరం రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పాలకవర్గ సభ్యులు బొట్టు రామచంద్రరావు, నెక్కలపు వాణిశ్రీ, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు ముక్కాల విజయలక్ష్మి, తిరువూరు పాల శీతల కేంద్రం మేనేజర్ టి.సాంబశివమూర్తి, పాలక వర్గ సభ్యులు, పాల ఉత్పత్తి దారులు, పాల సంఘాల అధ్యక్షులు కమ్మూరు సంఘ అధ్యక్షులు పొన్నగంటి శ్రీనివాసరావు, తుమ్మగూడెం అధ్యక్షులు మందలపు పద్మావతి, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే సుగుణ కళాశాల లక్ష్యం

ప్రజాశక్తి - కలిదిండి

12 ఏళ్లుగా పటిష్టమైన ఒకే యాజమాన్యంతో సమర్థవంతంగా నిర్వహిస్తూ ఇంటర్‌లో అత్యుత్తమ ప్రమాణాలను అందిస్తున్నట్లు శ్రీ సుగుణ జూనియర్, డిగ్రీ కళాశాల డైరెక్టర్ కారి రాజమణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ కలిదిండిలోని ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా రోడ్డులో శ్రీ సుగుణ జూనియర్, డిగ్రీ కళాశాల నెలకొల్పినట్లు చెప్పారు. విశాలమైన వాతావరణంలో గాలి, వెలుతురు ధారాళంగా ప్రసరించే తరగతి గదుల్లో విద్యాబోధన జరుగుతోందన్నారు. ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసి, హెచ్‌ఇసి కోర్సులు ఇంగ్లీషు, తెలుగు మీడియంలో బోధన చేస్తున్నామన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జూవాలజీ సబ్జెక్టులపై విద్యార్థులు పట్టు సాధించే రీతిలో ప్రత్యేకమైన ల్యాబ్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. అంకితభావంతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన మా ప్రత్యేకత అన్నారు. ప్రతి ఏటా ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో విద్యార్థులు రాణించేలా తర్ఫీదు ఇస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. బిఎస్‌సి (ఎంపిసి ఎస్), బిఎస్‌సి (ఎంపిసి), బిఎస్‌సి (బి జెడ్ సి), బికాం(జనరల్), బిఏ (హెచ్ పిపి/ఇపిపి) కోర్సులను కృష్ణా యూనివర్సిటీ ద్వారా గుర్తింపు పొందిన విద్యార్థులకు విద్య అందుబాటులో ఉండేలా విద్యాబోధన చేస్తున్నామన్నారు. ఉత్తమ క్రమశిక్షణ, అత్యుత్తమ విద్యాబోధనే లక్ష్యంగా నిరంతరాయంగా కృషి చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం మండలంలోని అన్ని రూట్లకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా నెలకొల్పిన శ్రీ సుగుణ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించి వారి భవితను బంగారు బాటలు వేయాలని డైరెక్టర్ కారి రాజమణి కోరారు.

అన్ని వసతులతో ప్రేరణాలయ

సిస్టర్ సుధారాణి

ప్రజాశక్తి - ముసునూరు

మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పించి, మంచి విద్యాబోధన ప్రేరణాలయ సోషల్ డెవలప్‌మెంట్ సెంటర్ కమ్యూనిటీ కాలేజ్ ద్వారా కల్పించనున్నట్లు ప్రేరణాలయ సిస్టర్ సుధారాణి అన్నారు. బుధవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ సోషల్ ప్రేరణాలయ సోషల్ డెవలప్‌మెంట్ ద్వారా ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతో పాటు వారికి సెలవుల సమయంలో ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్, అల్లికలు, ఎంబ్రాయిడరీ, డేటా ఎంట్రీ ఆపరేటర్ కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్యాన్సులు, డ్రాయింగ్, టైపింగ్ వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన, బాల్య వివాహాలు, పర్యావరణ పరిరక్షణపై, ఇంకుడుగుంతలపై కల్పించనున్నట్లు చెప్పారు. సామాజిక సేవ దృక్పథ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భారతి విద్యానికేతన్‌లో అత్యుత్తమ విద్యాబోధన

ప్రిన్సిపల్ శౌరి

ప్రజాశక్తి - ముసునూరు

నవోదయ, గురుకుల పాఠశాల సీట్లు సాధించడంలో తమ విద్యార్థులు సత్తా చాటారని ముసునూరు భారతి విద్యానికేతన్ హైస్కూల్ ప్రిన్సిపల్ కొండేటి శౌరి అన్నారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ 2004 నుంచి ఇప్పటివరకు సుమారు 799 మంది గురుకుల పాఠశాల సీట్లు, 2006 నుంచి ఇప్పటివరకు అనేక మంది నవోదయ సీట్లు సాధించడంలో తాము ప్రత్యేక కృషి ఇచ్చామని కరస్పాండెంట్ కొండేటి విజయలక్ష్మి తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్ మీడియంలో ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకు తరగతులను నిర్వహిస్తూ అందరి మన్ననలను పొందుతున్నామని తెలిపారు.

రోడ్లు, వంతెనలు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అలివేరు పంచాయతీ పరిధిలో పాడైపోయిన రోడ్లను, కొండ కాలువలపై వంతెనలు నిర్మించాలని అలివేరు సర్పంచి కారం లక్ష్మి ఆధ్వర్యంలో ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్‌కి గిరిజన దర్బార్‌లో బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచి కారం లక్ష్మి మాట్లాడుతూ అలివేరు పంచాయతీ పరిధి గ్రామాలు మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్నాయని, ఆదివాసి గిరిజన ప్రజలు రోజువారీ అవసరాల రీత్యా వెళ్లేందుకు రాకపోకలకు నానా అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. గతంలో వేసిన మెటల్ రోడ్డన్నీ రాళ్లు పైకి లేచిపోయి కాలి బాటసారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రేపల్లి గ్రామం నుంచి రేగులపాడు వరకు, గురుగుమిల్లి నుంచి చింతకొండవరకు, చింత కొండ నుంచి గొట్టాల రేవు వరకు, గొట్టాలరేవు నుంచి పూసల గొంది వరకు, గురుగు మిల్లి నుంచి రెడ్డి బోడేరు వరకు రహదారులు నిర్మించాలని కోరారు. ఈ రహదారుల వెంబడి అక్కడక్కడ కొండ కాలువల దగ్గర వంతెనలు నిర్మించాల్సి ఉందన్నారు. ఈ రోడ్లు, వంతెనల నిర్మాణానికి ప్రభుత్వ బడ్జెట్ కేటాయించి పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. రోడ్లు శిథిలావస్థలో ఉండడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు వెంటనే స్పందించి మారుమూల గ్రామాల రోడ్ల నిర్మాణానికి పూనుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కారం రాఘవ, ప్రగతిశీల యువజన సంఘం డివిజన్ నాయకులు టి.బాబూరావు, కట్టం నాగేశ్వరరావు, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న సర్పంచి కారం లక్ష్మి

విజయవంతంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

జంగారెడ్డిగూడెం గ్రంథాలయంలో చదరంగం పోటీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు బుధవారం చదరంగం పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరాల నేపథ్యంలో విద్యార్థులకు చదరంగం పోటీలు ఏర్పాటు చేశామని శాఖ గ్రంథాలయ అధికారి దుర్గారావు తెలిపారు. ఈ పోటీలను చదరంగం శిక్షణ నిపుణులు చంద్రశేఖర్ పర్యవేక్షించారని తెలిపారు. విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించడానికి దోహదపడేందుకు చదరంగం పోటీలు నిర్వహించామన్నారు. పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విద్యార్థులకు బహుమతులు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎండి అఫ్జల్ అలీ పాల్గొన్నారు.

మండవల్లి :విద్యార్థుల్లో భాషా నైపుణ్యం, మంచి అలవాట్లను, విలువలను నేర్పుకోవడానికి నీతి కథలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలుగు టీచర్ లంకపల్లి దుర్గా జ్యోతి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 17వ రోజు ఆమె శిబిరం వద్దకు చేరుకుని విద్యార్థులకు పంచతంత్ర తెలుగు కథలు చదివి బోధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీతితో కూడిన కథలు చిన్న పిల్లలకు మంచి సన్మార్గాన్ని స్ఫూర్తిని ఇస్తాయన్నారు. అంతేకాకుండా పంచతంత్ర కథలతో పాటు అత్యంత ప్రాచుర్యం పొందిన కోతి మొసలి కథలోని నీతిని విడమర్చి చెప్పి మంచి స్నేహితులను ఏవిధంగా ఎంచుకోవాలి అనేదానిపై వివరించారు. ఐక్యవేదిక సభ్యులు ఎల్.ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలలో కథలు చెప్పడం ఎంతో అవసరమన్నారు. సెల్‌ఫోన్ కల్చర్ రావడంతో నీతి కథలకు చిన్నారులు దూరమయ్యారన్నారు. అనంతరం తెలుగు టీచర్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల సభ్యులు ఎం.ఎన్.రావు, గ్రంథాలయ నిర్వాహకులు షేక్ పర్వీన్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి, గురజ శాఖా గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు బుధవారంతో 17వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు, పుస్తకాల చదివించడం, తదుపరి చిరపరిచయస్తుల ఉపాధ్యాయులు జగం బాబూరావు స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్ చెప్పారు. ముదినేపల్లి ఎపిఎ షణ్ముఖాషాయ పిల్లలకు మజ్జిగ సరఫరా చేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో ఇండోర్ గేమ్స్ ఆడించినట్లు ముదినేపల్లి, గురజ గ్రంథాలయాధికారులు ఎం.శ్రీదేవి, యూసఫ్ తెలిపారు.

సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులందరూ అదే పాఠశాలలో సమావేశమయ్యారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. 23 ఏళ్ల తరువాత నాటి విద్యార్థులు రాకతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. కలిదిండి సర్పంచి మసిముక్కు మారుతీప్రసన్న, పశ్చిమ గోదావరి జిల్లా ఉండి సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ ఉన్నారు. సివిల్, ఎఆర్, ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో 14 మంది కానిస్టేబుల్‌గా వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నట్లు నిర్వాహకులు మాజేటి వెంకటేశ్వరరావు, షహనాజ బేగం, పావని, ఆశా, సూర్యనారాయణ, పాము దుర్గారావు, పసలపూడి వీరబాబు, కనకరాజు తెలిపారు. అందరం ఒకే చోట కలవడం సంతోషాన్నిచ్చిందన్నారు. నాటి గురువులైన పసుపులేటి మురళీకృష్ణ, రవిశంకర్, ప్రసాద్, పూర్ణచంద్రరావు, శ్రీహరి, బొబ్బిలి నాగేశ్వరరావును ఘనంగా సన్మానించి తమ గురుభక్తిని చాటుకున్నారు.

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమని, వడ్డమాను వార్డు సభ్యులు దూపాటి సాంబయ్య అన్నారు. మండల పరిధిలోని వడ్డమాను గ్రామంలో చెల్లమ్మ కుంటలో ఉపాధి హామీ చట్టం పనులు నిర్వహిస్తున్న కూలీలకు ఆ గ్రామానికి చెందిన దూపాటి వీరయ్య గురువు 200మందికి మజ్జిగను వితరణగా అందించారు.

వాలంటీర్ల సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వాలంటీర్ల సేవలు ఎనలేనివని, వారు జగనన్న సైనికులు అని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి పొన్నం కన్వెన్షన్ హాలులో నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పలువురు వాలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.అనూష, జెడ్‌పిటిసి సభ్యులు పి.రాంబాబు, ఎంపిడిఒ కె.వాణి, తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు, వైసిపి నాయకులు పి.నరసింహారావు, ఎం.హరిబాబు, జి.ఇస్సాక్, సాదం గోపినాథ్ పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

ఈ పత్రికా ప్రకటన మూలంగా యావన్మందికీ తెలియజేయునది.. మా సంఘములో శ్రీమతి అను రజని, భర్త: వెంకటేశ్వర్లరావు, జన్మస్థలం మునుమర్రు, 2005 సంవత్సరంలో వారి తాలుకు ఒరిజినల్ దస్తావేజులు తనఖా పెట్టి ఋణం పొందియున్నారు. సదరు దస్తావేజులు మరియు రిజిస్టర్ల లెటర్ సీల్డ్ కవరులు లేదు. దీని పై విచారణ చేయగా పూర్వపు కార్యదర్శిగా వారు పని చేయుకాలం నుండి కనిపించలేదని చెప్పియున్నారు. అన్ని ప్రభుత్వములు దీని చేసిన తర్వాత ఈ ప్రకటన ఇవ్వుచున్నాము. ఈ దినప తెలిసిన దస్తావేజులు ఒరిజినల్ ఆచూకీ తెలిసినచో ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

దస్తావేజు వివరాలు

1) దస్తావేజు నెం. 1869/2001లో మునుమర్రు గ్రామ భూమి ఆర్.ఎస్.నెం. 113లో య.0-43 సెంట్లు. ఆర్.ఎస్.నెం. 71/3లో య.0-54 సెంట్లు. ఆర్.ఎస్.నెం. 71/3బి లో య.0-06 సెంట్లు.
2) దస్తావేజు నెం. 309/1998లో ఆర్.ఎస్.నెం. 71/1లో య.0-60 సెంట్లు.
3) దస్తావేజు నెం. 1871/2001లో ఆర్.ఎస్.నెం. 90/2లో య.0-50 సెంట్లు.

ధరణాల నాగపోల సింహాద్రి మణికంఠ
సెక్రటరీ, శ్రీగాంధీ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం
రి.నెం. 6/1/1954, మునుమర్రు.
సెల్: 77020 08189

ప్రతికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో

ఇ.పి.నెం.34/2022
ఇన్ ఓ.ఎస్.నెం.308/2018

డిక్రీహో: మోగలపు వెంకట దుర్గ ...డి.హెచ్.ఆర్ /వాది మరియు ...జె.డి.ఆర్ /ప్రతివాది దేవ బాలకృష్ణ

జె.డి.ఆర్: దేవ బాలకృష్ణ, తండ్రి: పోలరావు, వయసు 48 సం॥లు, డో.నెం. 3-45, వ్యాపారము, జగన్నాథపురం, TPG PJCJ.

పై నెంబరు గ్రంథమునందు మీకు అనేక పర్యాయములు నోటీసు పంపియున్నను మీరు సదరు నోటీసులు ఉద్దేశపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం మీకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది ఏమనగా సదరు పై గ్రంథములో ది.19-06-2023వ తేదీ అయి ఉన్నది. కావున సదరు వాయిదాకు మీరు గాని మీ తరుపు న్యాయవాది గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట ది.19-06-2023 తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయి మీయొక్క ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానం జరుపబడును అని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ముళ్ళపూడి శ్రీనివాసరావు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 94919 78178